# అమరప్రేమ

## మో. యు. చౌ

'వాంగ్‌చౌ'కు పదిహేడేళ్ళ ప్రాయమప్పుడే తండ్రి గతించాడు. ఒంటరిగాడయి పోయాడు. అయినా అతనికి స్వశక్తి మీద ఆధారపడి జీవించగల తెలివి తేటలున్నాయి. మరణశయ్యమీద ఉండగా అతని తండ్రి 'హొంగ్‌చౌ'లో నివసిస్తున్న తన చెల్లెలివద్దకు వెళ్ళమని చెప్పాడు. చెల్లెలికో కుమార్తె వుంది. వారిద్దరిలో ఎవరికి కుమార్తె, కుమారుడు కలిగినా ఇద్దరూ వియ్యమందుదామని వాగ్దానంకూడా చేసుకున్నారని చెప్పాడు తండ్రి 'చౌ'కు. తండ్రి చెప్పినప్రకారం 'చౌ' స్వగృహం వదలి 'హొంగ్‌చౌ'కు ప్రయాణమయ్యాడు. చిన్నతనంలో ఏనాడో చూచిన మరదలుపిల్లను మళ్ళీ చూడబోతున్నాననే ఆనందంతో హృదయము ప్పొంగిపోయింది. అత్తగారిఇంటివద్ద ఎపుడు వాల్తానా అని ఆత్రంగా వుంది. కాని ప్రయాణ సౌకర్యం అంతగా లేకపోవడంవల్ల గమ్యస్థానం చేరుకొనేటప్పటికి ఇరవైరోజులుపట్టింది.

అతని మేనత్త మొగుడు 'చాంగ్ యీ'కు అక్కడో ఔషధశాల వుంది. మందులూ అవీ విక్రయించటమే అతని వ్యాపారం. చూడటానికి మనిషి చాలా గంభీరంగా వుంటాడు. కంఠధ్వని కర్ణకఠోరంగా వుంటుంది. గడచిన పాతికేళ్ళనుంచి అత నీవ్యాపారం చేస్తున్నాడు. నిత్యం స్వయంగా షాపుకు వెళ్ళి వచ్చేవాడు. జాగ్రత్త, పొదుపుగల మనిషవటంవల్ల బాగా సంపాదించాడు. వ్యాపారం బాగా సాగుతోంది. కొత్తగా ఇల్లొకటి కట్టాడు.

షాపులో వాంగ్‌చౌను చూడగానే "ఏంపనిమీద వచ్చావోయి ఇక్కడకు?" అని అడిగాడనటం కంటే ఉరిమాడనడం సమంజసం. సంగతంతా చెప్పాడు వాంగ్‌చౌ. మేనమామ కొంచెం చిరాకుపడి చౌను మనిషినిచ్చి ఇంటికి పంపాడు. ఆ సమయంలో అత్త ఇంటివద్ద లేదు. నీలపుదుస్తులు ధరించిన ఓ అమ్మాయి వచ్చింది చావడిలోకి. ఆమె పేరు చియ్‌నియాంగ్. భుజాలమీదకు వచ్చిపడుతున్న దీర్ఘశిరోజాలతో, సన్నగా, నాజూకుగా, ఎంతో అందంగా వుంది. చౌను చూడగానే ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరై—

"నువ్వు-బావ-చావి!" అన్నది.

"చియాన్!" అన్నాడు చౌ.

"అబ్బ, ఎంతవాడివయ్యావు?" అంది ఆమె బావవంక చూస్తూ.

"మరి నువ్వుమాత్రం!" అన్నాడు చౌ. అతనికి మరణశయ్యమీద తండ్రి చెప్పినమాటలు గుర్తుకు వచ్చాయి. క్షేమ సమాచారాలు అయినతర్వాత చిన్ననాటి చిలిపి చేష్టలుఅవీ ముచ్చటించుకొన్నారు. 'నేను నీ బావనోయ్' అంటూ తయారయిన వీడెవ్వడురా అని ఆశ్చర్యపోయాడు ఓ కుర్రకుంక - చియాన్ తమ్ముడు.

చియాన్‌తల్లి మేనల్లుడిని చూడగానే ఎంతో సంతోషించింది. ఆసంగతీ ఈసంగతీ మాట్లాడిన తర్వాత ఆమె వ్యాపారవిషయం తెచ్చి, చాలాబాగా సాగుతోందని చెప్పింది.

"అవును. ఇల్లు చూస్తోంటేనే తెలుస్తోంది" అన్నాడు చౌ.

"ఆ, మీమామ అంతా అదో రకం మనిషి. పిల్లలూ నేను ఎంతో పోరు పెడితేనేగాని మారలేదు ఈ ఇంట్లోకి. ఇప్పుడుకూడా విచారిస్తారాయన, కొంప అద్దె కివ్వకపోవటం వల్ల ఎంతో డబ్బు నష్టపోతున్నామని. నువ్వు మాతోనే వుండు నాయనా! షాపులో ఏదైనాపని ఇప్పించమని మీమామయ్యనడుగుతాను. నీవనేదో నువ్వు జాగ్రత్తగా చేసుకుపోతూండు. ఆయన నోటికి జడుసుకునేవు. ఫరవాలేదు" అంటూ చెప్పింది అత్త.

ఆమెభర్త చాంగ్ చీకటిపడందే ఏరోజూ షాపునుంచి ఇంటికి వచ్చేవాడుకాదు. ఉదయం షాపుకు వెళ్లేముందు ఎంత చిరాకుగా వుండేవాడో వచ్చింతర్వాతా అట్లానే వుండేవాడు. అందుచేత సాహసించి

ఎవరూ అతనితో అంత చనువుగా వుండేవాళ్లు కాదు. బావమరిది మరణసమస్యకూడా అతని కంతగా సంబంధించినట్టు లేదు. దీంతో వాంగ్‌చౌకు అనాధ యువకుడిలా హీనంగా చూడబడుతున్నాననే భావం కల్గింది. కాని ఉదారస్వభావురాలైన అత్త మంచితనంవల్ల అతడు ఏయిబ్బందీ పడకుండా ఉండేవాడు. తల్లీ కూతుళ్లకు వ్యాపారమంటే బోధపడేదికాదు. తండ్రికి వ్యాపారం తప్ప ఇంకేమీ తెలిసేదికాదు.

కొంతకాలానికి చౌ కూడా ఆ కుటుంబంలోని వ్యక్తిగా స్థిరపడిపోయాడు. అతని చిన్నపుడు తండ్రి అత్తలమధ్య జరిగిన వివాహప్రస్తావన మళ్ళీ ఎప్పుడూ జరగలేదు. వాగ్దానంమాట ఏమైనా వాంగ్‌చౌకు ఆసేలిదుస్తుల్లోవున్న అమ్మాయే ఆరాధ్యదేవత అయింది. ఆమె కూడా అతన్నే పెళ్లాడాలని నిశ్చయించుకున్నది.

చియన్ ప్రవర్తనలో మార్పు గోచరించింది తల్లికి. చియనియాంగ్ ఏపని చేసినా అది చౌకోసమే నన్నట్లు చేసేది. అతని పనులన్నీ తన స్వంతపనులన్నట్లు చేసేది. అతని బట్ట లుతికి బాగుచేయటం నుంచి గది శుభ్రంచేసే వరకు ఆమెదే బాధ్యత.

ఒకరోజున కూతురితో తల్లి అంది చల్లగా:

"ఏమమ్మా, కూరల్లో ఉప్పు మరీ జోరుగా వేస్తున్నావు ఈ మధ్య?"

చియన్‌ముఖం సిగ్గుతో ముడుచుకుపోయింది. కూరల్లో ఉప్పు చాలటం లేదంటున్నాడు చౌ. అదీ కారణం.

చంగన్‌నుంచి ఒకరోజున చియన్ పెదతండ్రిభార్య వచ్చింది. పెదతండ్రి బాగా డబ్బున్నమనిషి. అతనే ఆమె తండ్రివ్యాపారానికి ధన సహాయం చేశాడు. చాంగ్‌కూడా ఇపుడు బాగా సంపాదించినా ఆ విషయం మర్చిపోకబట్టే అన్నంటే భయభక్తులతో చరిస్తాడు. ఆమెకు ఆయింట్లో రాణీ మర్యాదలు జరిగినయ్. భార్యతో కూడా సరససల్లాపాలాడి ఎరగని చాంగ్ వదినగారికి అడుగులకుమడుగులొత్తుతున్నాడు.

వదినగారికి తింటం పడిమంది ఇళ్ళకు వెళ్ళి రావటం తప్ప వేరేపని కనపడటంలేదు. ఉండి ఉండి మెరపులా ఓ ఆలోచన తట్టింది ఆమె బుర్రకు - మరదికూతురుకు పట్టణంలోని ఓధనికకుటుంబంతో సంబంధం మాట్లాడదామని. ఆ పట్టణంలో కల్లా 'సియాంగ్' కుటుంబీకులే ధనవంతులు.

ఓరోజున వాళ్లింట్లో విందుకు వెళ్లి వచ్చి అన్నది చియన్ తల్లితో.

"చూడు, చియన్ కపుడే 18 ఏళ్లు వచ్చాయి ఎదిగి కూర్చుంది ఇంట్లో. నే నో సంబంధం చూచాను అమ్మాయికి. సియాంగ్‌వారి రెండో అబ్బాయి ఉన్నాడు. 'సియాంగ్స్' అంటే తెలుసుగా నీకు?"

"లేదక్కా, అమ్మాయి నిదివరకే చౌకిద్దామని ఖాయమయింది" అంది తల్లి.

"అంటే, మీ మేనల్లుడికా? తాడు గోడూ లేదు. మీ అన్న ఏనాడో కాలం చేశాడు."

"అయితేమట్టుకేం అక్కా! ఈడూజోడూ కుదిరింది" తల్లి చౌను గురించి చెపుతూ వెనకేసుకొస్తుంటే చియన్‌కు సిగ్గేసింది.

వదినగారు గొల్లుమని నవ్వుతో అంది "నీకేమన్నా మతిపోయిందా? సమాజంలో పలుకుబడిఉన్న, గౌరవనీయమైన కుటుంబంతో సంబంధం తీసుకువస్తే వాడిని పట్టుకు వేలాడుతావు?"

దీంతో చియన్‌కు అరికాలి మంట నెత్తికెక్కింది. కూర్చున్న చోటినుంచి లేచి తలుపు దభాలున వేసి గది విడచి వెళ్లిపోయింది.

"ఎంత రాలుగాయిపిల్లే! దానికి నేనెంత మంచిచేస్తున్నానో గుర్తించటంలా అది. వాళ్ళభవనం, తోట అదీ నువ్వెపుడూ చూసి వుండవు. ఓసారి చూస్తే నీకే తెలుస్తుంది. బంధుప్రేమలోపడి పిల్లసుఖం పాడుచెయ్యకు." అంటూ బోధించటం మొదలెట్టింది.

చియాన్‌తల్లి ఏమీ జవాబు చెప్పలేదు. తల్లి వినకపోతే మానె తండ్రయినా వినకపోతాడా అనుకుంది. చాంగ్‌కు ఇంతకంటే కావలసిందేమీ లేదు ఈజీవితంలో. భార్యమాటకూడా వినకుండా సంబంధం ఖాయం చేశాడు. ప్రధానపు విందుకూడా జరిగింది. చియాన్ నిద్రాహారాలు మానేసింది.

"దీనివల్ల ఏమీ మంచి జరగదు. అమ్మాయి కిష్టంలేకపోయింతర్వాత చేసి ప్రయోజనం ఏమిటి? లోపలికి వెళ్ళి చూడండి, అదెలా గుండె పగిలేలా ఏడుస్తోందో. మనం చూడవలసింది దాని జీవితసౌఖ్యంకాని, ఆ సియాంగ్‌ల డబ్బుకాదు." అని అనేకవిధాల ప్రాధేయపడి చెప్పింది భర్తకు.

చియాన్ బలవంతంమీద ఆహారంతీసుకొని లేచితిరుగుతోంది. పంజరంలోని పక్షిలా వుంది ఆమె

మనస్సు. వాంగ్‌చౌకేమీ పాలుపోవటంలేదు. మనోవేదన చల్లార్చుకోటానికి హెంగ్ పర్వతాలవైపు పోయాడు. మూడువారా లయింది. చియన్‌ను చూడాలనే కాంక్షను నిరోధించలేకపోయాడు. తిరిగి వచ్చేటప్పటికి చియన్ ఏదో తెలియని వ్యాధితో బాధపడుతోంది. అతను ఇల్లువిడచి వెళ్లిన మర్నాటినుంచి ఆమె జ్ఞాపకశక్తి క్షీణించింది. తనకు తాను తెలియనిస్థితిలోవుంది. స్వంత తలిదండ్రులనే గుర్తు పట్టేది కాదు. వారికి అర్థం కానిమాటలేవో అంటూండేది. కుమార్తెకు మతి భ్రమ కలిగిందేమోనని భయపడ్డారు. ఆహార పానీయాలు లేకుండా ఉన్నా జబ్బేమీ ఉండేది కాదు వంటిని. మాట్లాడాలని ప్రయత్నించేవారు కాని నిర్జీవంగా ఉన్న కళ్లను చూస్తే అదోలా ఉండేది వారికి. మొహమంతా తెల్లగా పాలిపోయింది. వైద్యులు సహితం వ్యాధినిర్ధారణ చెయ్యలేకపోయారు. ఇటువంటి కేసు తామెప్పుడూ చూడలేదనీ, తమ వల్ల కాదని చెప్పారు.

అత్త అనుమతి తీసుకుని చౌ, చియన్ ఉన్న గదిలోకి పరుగెత్తుకెళ్లాడు.

'చియ్‌నియాంగ్, చియ్‌నియాంగ్' అని పిలచాడు. తల్లి ఆత్రంగా పరీక్షిస్తోంది కూతుర్ని. నిర్జీవమైన చియన్ కళ్లలోకి కొత్తకాంతి చేకూరుతోంది. కనురెప్పలు కదులుతున్నాయి. పాలిపోయిన మొహంలోకి తిరిగి రక్తం చేకూరింది.

'చియ్‌నియాంగ్, చియ్‌నియాంగ్' అని పిల్చాడు చౌ మళ్లీ.

ఆమె పెదవులు ఆనందంతో కదిలాయి.

'చౌ' అంది నీరసంగా.

"చియన్ తిరిగి బ్రతికావమ్మా. చూడమ్మా, చూడు మీ అమ్మను. అవునా?" అంది తల్లి అశ్రుపూరిత నయనాలతో.

"అవును, ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఏమిటిసంగతి? పక్కమీదున్నానేం?" అంది చియన్ ఏమీ తెలియనట్లు. యథార్థంగా ఇంతవరకు జరిగిందేమీ తెలియనట్టేవుందామెకు. తల్లి చెప్పగా విని నమ్మలేకపోయింది.

అమ్మాయికి తిరిగి కొద్దిరోజులలోనే సంపూర్ణారోగ్యం చేకూరింది. సుస్తీగా వున్నపుడు తండ్రి ఏమవుతుందో అని భయపడ్డాడు కాని తిరిగి తేరుకోగానే మామూలు ధోరణి సాగించాడు.

తను చూస్తూండగా కూతురు మొహంలోకి కళ ఏవిధంగా తిరిగి వచ్చిందో - భార్య చెపుతోంటే చాంగ్‌కు కోపం వచ్చింది.

"అంతా మోసం, నటన. డాక్టర్లకుకూడా తెలవదట. తల్లిదండ్రులనే గుర్తుపట్టలేదేం. నేను నమ్మను." అన్నాడు.

"లేదండీ, మీరే చూశారుగా స్వయంగా. బిడ్డ ఆహార పానీయాలు మాని ఎట్లా కృశించిపోయిందో. దానిహృదయంకూడా గుర్తించండి. మళ్ళీ ఆ సంబంధంసంగతి - "

"అంతటితో ఆపు. ప్రధానం కూడా జరిగింది. సియాంగ్ సంబంధం వదిలేయమనేనా నీ ఉద్దేశం అసంభవం" అన్నాడు చాంగ్.

అప్పటి కింకా వారితోనే వున్న వదినగారుకూడా మరదికి మద్దతు నిచ్చింది. "నేను 50 వళ్ళనుంచి చూస్తున్నా. ఇంతవరకు తలిదండ్రులెన్నెరగనన్న మనిషిని చూడలేదు" అంది ఇదంతా బూటకమన్నట్లు.

తండ్రి తిరిగి ఆ సంగతి ప్రస్తావించటానికి నిరాకరించాడు.

చౌ ఇదెంతమాత్రం భరించలేకపోయాడు. కాని చేయకల్గిందేమీ లేకపోయింది. నిరాశతోను, నిస్పృహతోను, తను స్వంతంగా జీవించటానికి నిశ్చయించుకుని రాజధానినగరానికి వెళ్ళిపోతున్నానని మామకు తెలియచేశాడు.

"మంచిది" అన్నాడు మామ.

అతని ప్రయాణానికి ముందుగా వారు ఆరాత్రి విందు చేశారు అతనికి. చియ్‌నియాంగ్ రెండురోజుల్నించి పడుకుని లేవటంలేదు. హృదయం బ్రద్దలయ్యేలా ఏడుస్తోంది.

చియన్‌ను కడసారి చూచి వెళ్తానని చెప్పి ఆమెగదికి వెళ్లాడు చౌ. ఆహారంతీసుకుని రెండురోజులయ్యింది. జ్వరం మండిపోతోంది. చౌ ఆమెను సాదరంగా నిమురుతూ "వెళ్తున్నాను చియన్. ఆఖరుసారి చెప్పి వెళ్దామని వచ్చాను. ఇంతకంటే చేయకల్గిందేమీ లేదు" అన్నాడు.

"ఇట్లాగే చావనియ్యి నన్ను. నీవు లేకపోయింతరవాత నేను బ్రతికి ఏంలాభం. జీవించాలని లేదు నాకు. ఒక్కసంగతిమాత్రం గుర్తుంచుకో చౌ. జీవించినా మరణించినా నా ఆత్మ ఎప్పుడూ నిన్ను వెన్నంటే ఉంటుంది - నీ వెక్కడున్నా" అంది చియన్.

చౌ ఆమె నేవిధంగాను ఓదార్చలేకపోయాడు. తిరిగి ఎన్నడూ ఈ ఇంటిఛాయలకే రాకూడదనే నిశ్చ

యంతో చౌ బయలుదేరాడు.

అతనిబోటు రెండుమైళ్లు వెళ్లేటప్పటికే చీకటి పడింది. ఆరాత్రి అక్కడే గడపదలచి లంగరు వేశాడు. ఏకాంతంగా కన్నీళ్లు కారుస్తూ విచారిస్తున్నాడు పక్కమీద. అర్ధరాత్రయ్యింది. గట్టుమీదనుంచి——

“బావా, చౌ” అని చియన్ పిలచినట్లువిన్పించింది. కలగంటున్నాననుకున్నాడు. పక్కమీద సుస్తీగా వున్న చియన్ ఇక్కడికెట్లా వచ్చింది? బోటు అంచుమీదనుంచి తొంగి చూచాడు. చియన్‌యాంగ్ గట్టుమీద నుంచుని వుంది. ఆశ్చర్యంతో ఒక్కదూకులో ఒడ్డును చేరుకున్నాడు.

“ఇంటివద్దనుంచి పారిపోయి వచ్చాను” నీరసంగా అంటూ అతని చేతుల్లో వాలిపోయింది. వెంటనే ఆమెను బోటులోకి తీసుకెళ్లాడు. మానవాతీతమైన శక్తి ఏదో ఆవహించితేనేతప్ప ఆస్థితిలో ఆమె ఇంత దూరం వచ్చి వుండ లేదనుకున్నాడు.

కొద్ది సపర్యలు చేసినపిమ్మట తేరుకుంది ప్రయాణపుబడలికనుంచి. ‘మనిద్దరినీ ఎవరూ వేరుచెయ్యలేరు. సర్వదా నేను నీతోనే వుంటాను” అంది. ఆ మర్నాడు తిరిగి వారు ప్రయాణం సాగించారు. త్రోవపొడుగునా విచారించింది తల్లిని గురించి. తను కనపడకపోవటంతో ఎంతగా విలపిస్తుందోనని.

చివరకు వారు ‘జఘాన్’ లో స్థిరపడ్డారు. అక్కడే వాంగ్‌చౌకు చిన్న ఉద్యోగం దొరికింది. జీతం డబ్బులు పోషణకు లోపం లేకుండా సరిపోతున్నాయి. ఖర్చు తగ్గించటానికని పట్టణానికి మైలుదూరంలో చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రోజూ అక్కడ్నించి ఆఫీసుకు నడచి వెళ్లేవాడు. చియన్‌యాంగ్ అతనికి వండిపెడుతూ ఉన్నదానితోనే సంతృప్తిచెందుతూ హాయిగా వుంది. చౌకు జీవితం తనకు తాను నమ్మలేనంత మధురంగా వుంది. గర్వంగా తన గదివంక చూసుకొనేవాడు. రెండుకుర్చీలు, బల్ల, ఓమామూలు మంచం - ఇంటిని అద్దెకిచ్చిన గృహస్థు, అతనిభార్యకూడా చాలా మంచివారు. కూరగాయలు కొనుక్కొనేపని లేకుండా తమతోటలో కాచినవి ఇచ్చేవాళ్లు. ప్రతిఫలంగా వీళ్లు తీరికసమయాల్లో తోటపని చేస్తూ సాయంచేసేవాళ్లు.

సంవత్సరం గడచింది. చియాన్‌యాంగ్‌కు ముద్దులొలికే కొడుకు కలిగాడు. ఆఫీసునుంచి రాగానే తల్లి దగ్గిర పాలు తాగుతున్న బిడ్డను చూడగానే యంగ్‌చౌ హృదయం ఆనందంతో ఉప్పొంగేది. కొడుకును చేతుల్లోకి తీసుకుని ముద్దులాడేవాడు. అతనికి చియాన్‌నిచూస్తే బాధగా వుండేది మనస్సులో. ఎంతో గారాబంగా సుఖంగా పెరిగినదానిని కష్టపెడుతున్నానే అని. చియాన్ ఇవేవీ పట్టించుకోకుండా పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయేది.

“ఇంకా బాగా సంపాదించి పనిమనిషి నొకదాన్ని పెడ్తా నీకు” అనేవాడు.

“ఊహు అవసరంలేదు. మనపని మనం చేసుకొంటానికేం?” అనేది ఆమె.

వారి జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా వెళ్లుతోంది. రోజురోజుకూ పిల్లాడిలో కొత్త అందం కొత్తఉత్సాహం కనబడుతున్నాయి. ప్రాకడం నేర్చుకున్నాడు. కావలసిందల్లా అంది పుచ్చుకుంటున్నాడు. పిల్లవాడితో వాళ్ళజీవితం అంతులేని ఆనందంగా తయారయ్యింది. పిల్లలులేని ఆ యింటిదంపతులుకూడా పీడంటే అమృతప్రేమగా వుండేవారు. పిల్లవాడిపోషణలో చియన్‌కు వాళ్లు సహాయం చేసేవాళ్లు.

తండ్రినిగురించి తలవకపోయినా చియన్ ఎప్పుడూ తల్లీ, తమ్ముడ్ని గురించే ఆలోచించేది.

“అమ్మనుగురించే ఆలోచిస్తున్నావు. అవునా? నాకు తెలుసు. ఇంటికి వెళ్లాలని కోరికవుంటే చెప్పు, తీసుకెళ్తాను మనకు వివాహమయ్యింది. మనకు ఈ కుర్రకుంక కూడా ఉండనే ఉన్నాడు. వెళ్లినా వాళ్లు మనల్ని చెయ్యగల్గిందేమీ

(47-వ పేజీ చూడండి)

విచిత్ర వ్యక్తి
మూలం: మార్క్‌ట్వేన్
అనువాదం: నండూరి రామమోహనరావు
వెల రూ. 1-8-0
పోస్టు ఖర్చులు ప్రత్యేకం
ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1.